అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

సంపుటి - 3 సంచిక -65 శనివారం 8 ఆగస్టు 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



2

ఆందోళన వద్దు.. నేను మీతోనే!

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

## 10న నాగార్జున సాగర్‌లో

# మహా వరుణయాగం

### పూర్ణాహుతికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరు

### రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



**హైదరాబాద్‌ఆగస్టు 7(జర్నలిస్ట్ వార్త);** తెలంగాణ ప్రజల సర్వతోముఖ శ్రేయస్సు కోసం రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ నెల పదో తేదీన నాగార్జున సాగర్‌లో మహా వరుణయాగం నిర్వహిస్తున్నామనీ, పూర్ణాహుతి కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శు క్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలనీ, కృష్ణాగోదావరి మహానదులు జలకళతో పరవళ్లు తొక్కాలనీ, నాగార్జునసాగర్‌తో పాటు మిగతాది 2లో...

## చేనేత రంగానికి

# రూ.980 కోట్లు

### చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..

### పీపుల్స్ ప్లాజాలో వస్త్ర ప్రదర్శనను ప్రారంభించిన తుమ్మల

### రైతన్నకు, నేతన్నకు ప్రభుత్వం సమాన ప్రాధాన్యతను ఇస్తోందని వెల్లడి

### 'నేతన్నకు భద్రత' కింద రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని అందిస్తున్నామన్న మంత్రి

**హైదరాబాద్‌ఆగస్టు 7(జర్నలిస్ట్ వార్త);** చేనేత కార్మికుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వ్యవసాయ, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పీపుల్స్ ప్లాజాలో 100కు పైగా స్టాల్స్‌తో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. భారతీయ సంస్కృతికి, వారసత్వానికి చేనేత ప్రతీక అని, గద్వాల, పోచంపల్లి, నారాయణపేట వస్త్రాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి నేతన్నలను ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్నకు, నేతన్నకు సమాన ప్రాధాన్యతను ఇస్తోందని మంత్రి తెలిపారు. మిగతాది 2లో...



## ఎఫ్‌సీఆర్‌ఏ బిల్లు మా అంతర్గత విషయం


## : అమెరికాకు భారత్ గట్టి కౌంటర్

### ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లుపై అమెరికా ఎంపీ వ్యాఖ్యలను ఖండించిన భారత్

### ఇది పూర్తిగా తమ అంతర్గత వ్యవహారమని స్పష్టం చేసిన విదేశాంగ శాఖ

### విదేశీ నిధుల నియంత్రణపై అమెరికాలోనూ చట్టాలున్నాయని వెల్లడి

**న్యూఢిల్లీ,ఆగస్టు 7(జర్నలిస్ట్ వార్త);** విదేశీ విరాళాల నియంత్రణ సవరణ బిల్లు-2026 (ఖీజ=ూ)పై అమెరికా కాంగ్రెస్ సభ్యుడు చేసిన విమర్శలను భారత విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. ఇది పూర్తిగా తమ అంతర్గత వ్యవహారమని, దీనిపై ఇతరుల వ్యాఖ్యలు అనవసరమని స్పష్టం చేసింది. విదేశీ నిధుల నియంత్రణకు సంబంధించి అమెరికాతో సహా ప్రపంచంలోని అనేక దేశాల్లో కఠినమైన చట్టాలు అమలులో ఉన్నాయని ఈ సందర్భంగా గుర్తుచేసింది. మిగతాది 2లో...



## హైదరాబాద్‌లో భారీ బస్ టెర్మినల్ నిర్మాణం

### గాజులరామారంలో 100 ఎకరాల్లో ఏర్పాటు

### ట్రాఫిక్ ను తగ్గించేందుకు ప్రభుత్వ ప్రణాళిక

### లోక్‌సభలో ధ్రువీకరించిన కేంద్రమంత్రి గడ్కరీ



**న్యూఢిల్లీ,ఆగస్టు 7(జర్నలిస్ట్ వార్త);** హైదరాబాద్ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. నగర శివారులోని గాజులరామారంలో 100 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మాణానికి భూమి కేటాయించినట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధికారికంగా ప్రకటించారు. ఈ బస్ టెర్మినల్ నిర్మాణం పూర్తయితే నగరంలో ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని అధికారులు అంచనామిగతాది 2లో...



## నీట్ ప్రశ్నలు లీక్ చేసింది ఆ ముగ్గురే

### చార్జ్‌షీట్‌లో సీబీఐ స్పష్టం 20 వేల పేజీల ఆధారాలు ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టులో సమర్పించినట్లు వెల్లడి

### ఎన్టీఏ విధి నిర్వహణలోనూ లోపాలున్నట్టు గుర్తించిన ఏసీబీ అధికారులు

**న్యూఢిల్లీ ఆగస్టు 7(జర్నలిస్ట్ వార్త);** నీట్ యూజీ పేపర్ లీకేజీ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన విషయం విదితమే. పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనంటూ న్యూ ఢిల్లీలోని జంతర్
మిగతాది 2లో...

# బీజేపీ ఒంటరి పోరు

### జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో ఎవరితోనూ పొత్తులు ఉండవని స్పష్టం చేసిన రామచందర్ రావు

### రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై పోరాడాలని అధిష్ఠానం ఆదేశం

### మండల, బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి

### తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటు లక్ష్యమన్న నేతలు



**న్యూఢిల్లీ,ఆగస్టు 7(జర్నలిస్ట్ వార్త);** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ తెలంగాణ విభాగం అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో ఎటువంటి పొత్తులు లేకుండానే బరిలోకి దిగుతామని ఆయన ప్రకటించారు.ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో భేటీ అనంతరం రామచందర్ రావు మీడియాతో మాట్లాడారు. "తెలంగాణలో బీజేపీ ఎవరితోనూ పొత్తులు పెట్టుకోదు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తాం" అని ఆయన ఉద్ఘాటించారు. రాష్ట్ర పార్టీ నేతల మధ్య విభేదాలు లేవని, కేవలం అభిప్రాయ

## ఏపీలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు..


### పలు కీలక శాఖలకు కొత్త కార్యదర్శుల నియామకం

### కొంతమంది అధికారులకు పూర్తి అదనపు బాధ్యతల అప్పగింత

### ఐఏఎస్ అమ్రాపాలి సహా కొందరికి పోస్టింగ్ ఇవ్వకుండా జీఏడీకి రిపోర్ట్ చేయాలని ఆదేశం

### గోదావరి పుష్కరాలకు ప్రత్యేక, సంయుక్త ప్రత్యేక అధికారుల నియామకం

**ఆగస్టు 7(జర్నలిస్ట్ వార్త);** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో భారీ స్థాయిలో పరిపాలన ప్రక్షాళన జరిగింది. పెద్ద ఎత్తున ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులను బదిలీ చేస్తూ, మరికొందరికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు (జీవో ఆర్టీ నెం.1539) జారీ చేశారు. ఈ బదిలీలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. విద్యా, పర్యాటక, రవాణా, గృహనిర్మాణం వంటి కీలక శాఖలకు కొత్త అధిపతులు రాగా, కొందరు సీనియర్ మిగతాది 2లో...



## మిషన్ భగీరథ దేశానికే ఆదర్శం

### ఫ్లోరోసిస్ రక్కసిని (రూపు)మాపిన వ్యవస్థ

### కాంగ్రెస్ నిర్లక్ష్యంతో నిర్వీర్యం : మాజీమంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్‌ఆగస్టు 7(జర్నలిస్ట్ వార్త);** తెలంగాణలో ప్రతి ఇంటికీ సురక్షిత, స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ప్రారంభమైన మిషన్ భగీరథ పథకం నేటితో పదేండ్లు పూర్తి చేసుకోవడం సంతోషకరమని బీఆర్‌ఎస్‌ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణలో ఇంటింటికీ తాగునీటి విప్లవానికి దశాబ్ది కాలం పూర్తయ్యిందని ఎక్స్ వేదికగా శుక్రవారం వీడియోను షేర్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ.. దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. తెలంగాణలో ఫ్లోరోసిస్ రక్కసిని మిగతాది 2లో...



## సీఎం రేవంత్‌కు కేటీఆర్

# బహిరంగ లేఖ!

### నేతన్న బీమా, నేతన్నకు చేయూత వంటి కార్యక్రమాలను ఆపేశారని మండిపాటు

### రద్దు చేసిన పథకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్



**హైదరాబాద్‌ఆగస్టు 7(జర్నలిస్ట్ వార్త);** జాతీయ చేనేత దినోత్సవం వేళ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వేలాది చేనేత కుటుంబాలకు ఆర్థిక ధీమానిచ్చిన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' వంటి గొప్ప పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసి నేతన్నలను కోలుకోలేని దెబ్బతీసిందని తన లేఖలో ఆయన మండిపడ్డారు. బతుకమ్మ చీరలు, స్కూల్ యూనిఫారాల తయారీ ఆర్డర్లను పక్కనబెట్టి, కమీషన్ల కోసం ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. 2లో...

# 18 ఏళ్ల ఇంటి పట్టాల నిరీక్షణకు తెర

## ఇందిరమ్మ కాలనీ వాసులకు ఒరిజినల్ పట్టాల పంపిణీ

**మిర్యాలగూడ/ఆగస్టు 7 (జర్నలిస్ వార్త):**



ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఇంటి పట్టాల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. మిర్యాలగూడ 6వ వార్డు ఇందిరమ్మ కాలనీకి చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నల్లమోతు సిద్ధార్థ శుక్రవారం ఒరిజినల్ ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఇంటి పట్టాల కోసం కాలనీవాసులు సుమారు 18 ఏళ్లుగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. సమస్యను తెలుసుకున్న భూక్య రాంబాబు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పట్టాలు మంజూరయ్యేలా కృషి చేసినట్లు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు సహకారంతో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

పట్టాలు అందుకున్న లబ్ధిదారులు భూక్య రాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం అందుబాటులో ఉంటానని, భవిష్యత్తులోనూ ప్రజా సమస్యలపై తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

# మోషిన్ అలీ కుటుంబాన్ని పరామర్శించిన స్కైలాబ్ నాయక్

## మాతృమూర్తి మృతికి నివాళి.. కుటుంబ సభ్యులకు సానుభూతి

**మిర్యాలగూడ/ఆగస్టు 7 (జర్నలిస్ట్ వార్త):**



మాడ్గులపల్లి మండలం అగామోత్కూర్ గ్రామానికి చెందిన నల్లగొండ జిల్లా మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ. మోషిన్ అలీ మాతృమూర్తి మృతి చెందడంతో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు స్కైలాబ్ నాయక్ వారి కుటుంబాన్ని పరామర్శించారు. శుక్రవారం ఆయన మోషిన్ అలీ నివాసానికి వెళ్లి మృతురాలి పార్థివదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.

# విద్యుత్ శాఖ డీఈగా జై.ఇంద్ర

## నూతన డీఈకు అధికారుల స్వాగతం

**మిర్యాలగూడ/ఆగస్టు 7 (జర్నలిస్ వార్త):**



మిర్యాలగూడ విద్యుత్ శాఖ డీఈగా జై.ఇంద్ర శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు విద్యుత్ సేవలను మరింత మెరుగ్గా అందించేందుకు సమన్వయంతో పనిచేయాలని అధికారులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కూరగాయల సాగుతో నిత్య ఆదాయం

## ఎల్‌నినో పరిస్థితుల్లో ఆరుతడి పంటలే మేలు.. 4 వేల ఎకరాల్లో సాగుకు ప్రణాళిక



**మహబూబాబాద్/ ఆగస్టు 7 (జర్నలిస్ వార్త):** ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ఆరుతడి, కూరగాయల పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జినుగు మరియన్న సూచించారు. మహిళా సంఘాల సహకారంతో జిల్లాలో కూరగాయల సాగు విస్తీర్ణాన్ని పెంచాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశాల మేరకు జిల్లాలో 4 వేల ఎకరాల్లో కూరగాయల సాగుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు మహిళా స్వయం సహాయక సంఘాలు, వ్యవసాయ శాఖ సహకారంతో 524 ఎకరాల్లో కూరగాయలు సాగు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత వానాకాలంలో టమాటా, వంకాయ, పచ్చిమిరప, బీర, సొరకాయ, కాకర, బోడకాకర, బెండ, చిక్కుడు, ఆకుకూరలు తదితర పంటలను సాగు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు పందిరి, ట్రెల్లిస్, ఎత్తుమడులు, మల్చింగ్, బిందు సేద్యం, పంట కుంటలు, సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలని సూచించారు. కూరగాయల సాగుతో ఎకరాకు సుమారు రూ.లక్ష వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని, మార్కెటింగ్‌పై కూడా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ డీపీఎం శ్రీకాంత్, ఉద్యాన అధికారులు ఏజే శాంతిప్రియదర్శిని, ఎం.స్రవంతి, సిబ్బంది జ్యోత్స్న, సుకన్య, రామకృష్ణ, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# 4వ తరగతి విద్యార్థికి అ రాదా?

## పాకలగూడెం ప్రభుత్వ పాఠశాలలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

**దమ్మపేట/ ఆగస్టు 7 (జర్నలిస్ట్ వార్త):**



నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థికి కనీసం అ అక్షరం కూడా రాకపోవడంపై అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం దమ్మపేట మండలం పాకలగూడెం ప్రభుత్వ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఓ విద్యార్థిని బోర్డుపై అక్షరం రాయాలని కోరగా రాయలేకపోవడంతో ఉపాధ్యాయుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విధులకు వచ్చామా.. వెళ్లామా అన్నట్లుగా కాకుండా బాధ్యతతో పనిచేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని అన్నారు. పిల్లలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పేర్కొన్నారు.

# గడువులోగా జనగణన వివరాల సేకరణ పూర్తి చేయాలి

## నాణ్యత, ఖచ్చితత్వంలో రాజీ వద్దు.. జనగణన సంచాలకులు భారతి హోళికేరి

**మహబూబాబాద్/ఆగస్టు 7 (జర్నలిస్ వార్త):**




జనగణన2027లో భాగంగా జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ తయారీకి అవసరమైన గ్రామ, పట్టణ డైరెక్టరీ వివరాల సేకరణను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర జనగణన సంచాలకులు భారతి హోళికేరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో సమీక్షించారు. మహబూబాబాద్ నుంచి కలెక్టర్ స్నేహ శబరిష్, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాలు, పట్టణాల్లో విద్య, వైద్యం, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, రహదారులు, రవాణా, బ్యాంకింగ్, వ్యవసాయం, మార్కెటింగ్, సామాజిక, ఆర్థిక మౌలిక వసతులు, ప్రభుత్వ సేవలకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా సేకరించాలని సూచించారు. క్షేత్రస్థాయి సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి సమాచార సేకరణలో ఏకరూపత, ఖచ్చితత్వం ఉండేలా చూడాలన్నారు. మొబైల్ యాప్, వెబ్ పోర్టల్ ద్వారా వివరాలను నమోదు చేయాలని, డూప్లికేట్ సమాచారం లేకుండా సంబంధిత శాఖల రికార్డులతో ధ్రువీకరించాలని ఆదేశించారు. యూజర్ ఐడీలు, పాస్‌వర్డ్‌లను గోప్యంగా ఉంచాలని, అధికారిక యాప్, పోర్టల్ మాత్రమే వినియోగించాలని సూచించారు.

**సెప్టెంబరు 8లోగా పూర్తి చేయాలి**

కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ జనగణన హ్యాండ్‌బుక్ భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలు, సంక్షేమ పథకాల రూపకల్పనకు కీలక సమాచారంగా ఉపయోగపడుతుందన్నారు. ఆగస్టు 10 నుంచి సెప్టెంబరు 8 వరకు వెబ్ పోర్టల్ అందుబాటులో ఉంటుందని, ఈలోగా సమాచార సేకరణ, నమోదు ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

కార్యక్రమంలో డీఆర్డీవో పీడీ మధుసూదనరాజు, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి విజయచంద్ర, డీఎస్‌వో రమేష్, డీపీవో రేవంత్, ఎల్‌డీఎం యాదగిరి, ఆర్టీసీ డీఎం కల్యాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వెంకటాద్రి రెడ్డి చిత్రపటానికి నివాళి

**కేసముద్రం/ఆగస్టు 7 (జర్నలిస్ వార్త):**



కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని విలేజ్ కేసముద్రం 7వ వార్డుకు చెందిన వేముల వెంకటాద్రిరెడ్డి దశదిన కర్మ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమా నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# చేనేత కార్మికులకు ఘన సన్మానం

## జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కార్యక్రమం

**హసన్‌పర్తి/ ఆగస్టు 7 (జర్నలిస్ వార్త):**



జాతీయ చేనేత కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ హసన్‌పర్తి ఆధ్వర్యంలో చేనేత కార్మికులను ఘనంగా సన్మానించారు. హసన్‌పర్తి పారిశ్రామిక ఉత్పత్తుల సంఘంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్మికులకు శాలువాలు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లయన్ డాక్టర్ దీవి అజిత్‌కుమార్ మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు చేనేత రంగం ప్రతీకగా నిలుస్తోందన్నారు. చేనేత కార్మికులు తమ శ్రమతో దేశ వారసత్వాన్ని భావితరాలకు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఆధునిక కాలంలోనూ చేనేత వస్త్రాలను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. చేనేత కార్మికుల సంక్షేమానికి సమాజం అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కనుకుంట్ల సతీష్, డాక్టర్ శేఖర్, కృపాకర్, తోట సంపత్, దికొండ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# వెంకటయ్యకు ఎమ్మెల్యే నివాళి

**కేసముద్రం/ ఆగస్టు 7 (జర్నలిస్ వార్త):**



కేసముద్రం పట్టణానికి చెందిన కౌన్సిలర్ తరాల వీరేష్ యాదవ్ తాత తరాల వెంకటయ్య మృతి చెందారు. ఆయన పార్థివదేహానికి మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ సునీత వెంకన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, జిల్లా అధికార ప్రతినిధి అంబటి మహేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్‌నాయక్, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే పేదరికానికి చెక్

## ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు అర్పణపల్లి విద్యార్థులకు పుస్తకాల పంపిణీ






**కేసముద్రం/ ఆగస్టు 7 (జర్నలిస్ వార్త):** విద్యతోనే పేదరికాన్ని అధిగమించి ఉన్నత స్థాయికి ఎదగవచ్చని ఆర్టీఐ కార్యకర్త గంధం భరత్ అన్నారు. కేసముద్రం మండలం అర్పణపల్లి ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు త్వరలో జరగనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు సంబంధించిన అధ్యయన పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువుల్లో రాణించాలని కోరారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా సాధన చేస్తే పరీక్షలో విజయం సాధించవచ్చన్నారు. విద్యార్థులను పరీక్షకు సిద్ధం చేసేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు, నమూనా పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నరసింహరాజు, ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తల్లిపాలే శిశువుకు తొలి టీకా



**కేసముద్రం/ఆగస్టు 7 (జర్నలిస్ వార్త):**

కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని గిర్ని తండ అంగన్వాడీ కేంద్రంలో ఆరు అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా 15వ వార్డు కౌన్సిలర్ విజయభద్రు గర్భిణులు, బాలింతలు, తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పుట్టిన గంటలోపే శిశువుకు ముర్రుపాలు పట్టించాలని, తొలి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. తల్లిపాలు శిశువుకు తొలి టీకా వంటివని, వాటిలోని పోషకాలు, రోగనిరోధక శక్తి అనేక వ్యాధుల నుంచి శిశువును రక్షిస్తాయని తెలిపారు. డబ్బా పాలు కాకుండా తల్లిపాలనే అందించాలని, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు రమాదేవి, కవిత, జ్యోతి, లలిత, పుష్పలీల, రాజమణి, ప్రధానోపాధ్యాయుడు జనార్దన్, తల్లులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన శంకర్‌నాయక్



**కేసముద్రం/ ఆగస్టు 7 (జర్నలిస్ వార్త):**

కేసముద్రం మున్సిపాలిటీ 12వ వార్డుకు చెందిన తరాల వీరేష్ తాత తరాల వెంకటయ్య మృతి విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ శుక్రవారం వారి నివాసానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అనంతరం కేసముద్రం స్టేషన్ మాజీ ఎంపీటీసీ ఆగే వెంకన్న తల్లి ఆగే రామనర్సమ్మ మృతిచెందడంతో ఆమె పార్థివదేహానికి కూడా నివాళులర్పించారు. ఇరు కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ జడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎండీ నజీర్, టౌన్ పార్టీ అధ్యక్షుడు వీరునాయక్, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలు.. శిశువుకు అమృతం

## ముర్రుపాల ప్రాధాన్యంపై అవగాహన




**నర్సంపేట/ఆగస్టు 7 (జర్నలిస్ వార్త):** తల్లిపాలు శిశువుకు అమృతంతో సమానమని బోడ మాణిక్యం తండ గ్రామపంచాయతీ సర్పంచ్ ఉమా మహేష్ నాయక్ అన్నారు. తల్లిపాలతో శిశువుకు అవసరమైన పోషకాలు లభించడంతో పాటు రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. చెన్నారావుపేట మండలం బోడ మాణిక్యం తండ గ్రామపంచాయతీ పరిధిలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిశువు జన్మించిన వెంటనే అందించే ముర్రుపాలు ఎంతో విలువైనవని, వాటిని తప్పనిసరిగా బిడ్డకు పట్టించాలని తల్లులకు సూచించారు. తల్లిపాలు శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు ఎంతో దోహదపడతాయని వివరించారు. అనంతరం చిన్నారికి అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ స్వరూపారాణి సచిదేవి, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు పెద్దపీట

## కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం : ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు





**హసన్‌పర్తి/ ఆగస్టు 7 (జర్నలిస్ వార్త):**మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. శుక్రవారం ఎర్రగట్టుగుట్ట వెంకటేశ్వర కల్యాణ మండపంలో 65, 66వ డివిజన్లకు చెందిన మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తోందన్నారు. మహిళా సాధికారత, స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. అర్హులైన పేద మహిళలు, మహిళా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరలు అందిస్తున్నామని చెప్పారు. కుటుంబ అభ్యున్నతిలో మహిళల పాత్ర కీలకమని, పిల్లలను ఉన్నతంగా చదివించి భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాలను మహిళల పేరుతో మంజూరు చేస్తూ వారికి ప్రాధాన్యం కల్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కిరణ్, సునీల్, మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతి, మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు జోరిక పూల, ఉపాధ్యక్షురాలు స్వాతి, మాజీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పైవేటు విద్యాసంస్థల్లో భద్రతా ప్రమాణాలపై ఆందోళన

## ఫైర్ సేఫ్టీ, వెంటిలేషన్, మరుగుదొడ్లపై తనిఖీలు చేయాలంటున్న తల్లిదండ్రులు

**సత్తుపల్లి/ ఆగస్టు 7 (జర్నలిస్ వార్త):**
ఖమ్మం జిల్లాలోని పలు ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల భద్రతకు సంబంధించిన ఏర్పాట్లపై తల్లిదండ్రులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని విద్యాసంస్థల్లో అగ్నిమాపక భద్రతా పరికరాలు, అత్యవసర మార్గాలు, వెంటిలేషన్, మరుగుదొడ్ల సౌకర్యాలు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా అనే అంశంపై సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించాలని వారు కోరుతున్నారు. కొన్ని విద్యాసంస్థల్లో తరగతి గదులు, కారిడార్లు ఇరుకుగా ఉన్నట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులను సురక్షితంగా బయటకు తరలించే మార్గాలు,





అగ్నిమాపక పరికరాల అందుబాటుపై స్పష్టత అవసరమని పేర్కొంటున్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాణనష్టం నివారించేందుకు ముందస్తు భద్రతా చర్యలు కీలకమని నిపుణులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు విద్యాసంస్థలను నిబంధనల ప్రకారం తనిఖీ చేసి, అవసరమైన భద్రతా చర్యలు అమలయ్యేలా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# అర్హతే ప్రామాణికం.. సంక్షేమమే లక్ష్యం

## అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు.. మంత్రి పొంగులేటి



**తిరుమలాయపాలెం/ఆగస్టు 7 (జర్నలిస్ వార్త):**
అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో అమలు చేస్తున్నామని తెలిపారు.
తిరుమలాయపాలెం మండలంలో శుక్రవారం పర్యటించిన మంత్రి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. తిప్పారెడ్డిగూడెంరాకాసితండా బీటీ రోడ్డుకు రూ. 2.10 కోట్లు, హైదర్‌సాయిపేట, పాతర్లపాడు గ్రామాల్లో గ్రామపంచాయతీ భవనాలకు చెరో రూ. 20 లక్షలు, రాజారంతుమ్మగూడెం బీటీ రోడ్డుకు రూ. 4.50 కోట్లతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు.

**పేదల సంక్షేమానికి పెద్దపీట**

ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. రైతులకు రైతుభరోసా కింద ఎకరాకు రూ. 6 వేల పెట్టుబడి సాయం అందించామని, సన్నరకం వడ్లకు క్వింటాకు రూ. 500 బోనస్ ఇస్తున్నామని వివరించారు.

**ప్రతి పేద కుటుంబానికీ ఇల్లు**

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు మంజూరు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఇళ్ల కోసం ఎవరూ ఒక్క పైసా కూడా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. త్వరలో రెండో విడత ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తామని, నిర్మాణ పురోగతికి అనుగుణంగా బిల్లులు నేరుగా ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు.

**ఆగస్టు 15 నుంచి ఆసరా పింఛన్లు**

ఆగస్టు 15 నుంచి ఆసరా పింఛన్ల మంజూరు ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పింఛన్ అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.
కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్ అధికారులు, ఆర్డీవో, తహసీల్దార్, ఎంపీడీవో, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రతి త్రివర్ణ పతాకం ఎగరాలి

## ‘హర్ ఘర్ తిరంగా’ను విజయవంతం చేయాలి.. బీజేపీ నాయకుల పిలుపు

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో ఆగస్టు 7 (జర్నలిస్ వార్త):**
దేశభక్తిని చాటడం ప్రతి భారతీయుడి బాధ్యత అని బీజేపీ నాయకులు అన్నారు. హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ధర్మసాగర్ మండల కేంద్రంలోని ఆర్ఎన్ఆర్ మెమోరియల్ పాఠశాలలో శుక్రవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు బైరపాక కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి కార్యక్రమం ఇన్‌చార్జి సీతాదుర్గ ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీతాదుర్గ ప్రసాద్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు ప్రాణత్యాగాలు చేశారని, వారి త్యాగాల ఫలితంగానే నేడు స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని అన్నారు. దేశభక్తిని ప్రతి ఒక్కరూ చాటాలని, హర్ ఘర్ తిరంగా లో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని



పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు ఆదేశాలతో, జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్ సూచనల మేరకు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పెరుమాండ్ల అమరేందర్‌రెడ్డి, గంకిడి వెంకట్‌రెడ్డి, దాసరి సదానందం, దుస్సా రాములు, మండల ప్రధాన కార్యదర్శులు బచ్చు శివప్రసాద్‌రెడ్డి, సాయం సందీప్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు అనిరుద్, నాయకులు కుమార్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# పంట కుంటలు పూర్తి చేయాలి

**ఈ నెల 12లోగా ఒక్కో పంచాయతీలో కనీసం 20 కుంటలు.. పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్**




**తల్లాడ/ ఆగస్టు 7 (జర్నలిస్‌శ్రీవార్త):**
గ్రామాల్లో పంట కుంటల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తల్లాడ మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఎంపీడీవో శ్రీధర్‌రాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీలోగా ప్రతి గ్రామపంచాయతీలో కనీసం 20 పంట కుంటలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ఈ నెల 14వ తేదీలోగా అన్ని గ్రామపంచాయతీలు సమగ్ర అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు ఏన్కూరు భాగ్యశ్రీ, శ్రీధర్‌రాజు, ఏపీడీ చలపతి, కల్లూరు బీఎల్‌పీవో విజయలక్ష్మి, అదనపు పీడీ శిరీష, ఎంపీవో హరికృష్ణ, ఈవోపీఆర్డీ నారాయణ, ఎస్‌బీఎం డీపీఎం అనూప్, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి నిరంతర ప్రక్రియ

## రూ.2.65 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



**హసన్‌పర్తి/ ఆగస్టు 7 (జర్నలిస్ట్ వార్త):**అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని, వర్ధన్నపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. శుక్రవారం 1వ డివిజన్ పరిధిలోని బాలాజీనగర్, శ్రీనివాస్ కాలనీ, ఆనందనగర్, పద్మావతినగర్, దుర్గకాలనీల్లో రూ. 2.65 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్లక్ష్యానికి గురైన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని చెప్పారు. డ్రైనేజీ వ్యవస్థ బలోపేతమైతేనే పరిసరాలు పరిశుభ్రంగా, ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కాలనీలను సుందరంగా తీర్చిదిద్దేందుకు అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ పేదలకు అండగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు చిర్ర రాముగౌడ్, జిల్లా కార్యదర్శి ఏరుకొండ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ మెరుగు రాజేష్‌గౌడ్, నాయకులు దేవరకొండ అనిల్, గడ్డం శివరాం, పొన్నాల రఘు, గంట రాజిరెడ్డి, మూల తిరుపతిరెడ్డి, రవి యాదవ్, ఐలయ్య, రమేష్, అధికారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# చినుకు పడితే.. ఇళ్లలోకి వరద

## డ్రైనేజీ లేక యర్రబోయినపల్లి ఎస్సీ కాలనీవాసుల అవస్థలు



**కల్లూరు/ ఆగస్టు 7 (జర్నలిస్ట్ వార్త):**చిన్నపాటి వర్షానికే యర్రబోయినపల్లి ఎస్సీ కాలనీ జలమయమవుతోంది. డ్రైనేజీ సౌకర్యం లేక వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక రోడ్లపై నిలిచి, లోతట్టు ప్రాంతంలోని ఇళ్లలోకి చేరుతోంది. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లుగా సమస్య కొనసాగుతున్నా అధికారులు పరిశీలనలకే పరిమితమవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం వచ్చిన ప్రతిసారీ ఇళ్లలోని నీటిని తోడేందుకు రాత్రంతా జాగారం చేయాల్సి వస్తోందన్నారు. దోమల బెడద, సీజనల్ వ్యాధుల భయం వెంటాడుతోందని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి డ్రైనేజీ నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

# ఎరువుల దుకాణాల తనిఖీ

**బయ్యారం/ఆగస్టు 7(జర్నలిస్ట్ వార్త):**
బయ్యారం మండలంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో శుక్రవారం పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ ప్రశాంత్ బాబు, మండల వ్యవసాయ అధికారి కే. రాజు ఆధ్వర్యంలో కొత్తపేటలోని బిస్మిల్లా ఎంటర్‌ప్రైజెస్, మదీనా ట్రేడర్స్, అగ్రో రైతు సేవా కేంద్రాలను పరిశీలించారు. పారాక్వాట్ కలుపు మందు నిల్వలు,



విక్రయాలు ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్వహించాలని డీలర్లకు సూచించారు. గడువు ముగిసిన లేదా నాసిరకం మందుల విక్రయాలు గుర్తిస్తే వెంటనే వ్యవసాయ శాఖ, పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు తెలిపారు.

## మిల్లెట్ యూనిట్ పునరుద్ధరణకు చర్యలు



**పర్వతగిరి/ఆగస్టు 7(జర్నలిస్ట్ వార్త);**కొంకపాకలో రూర్బాన్ ప్రాజెక్టు కింద రూ.50 లక్షలతో నిర్మించిన మిల్లెట్ యూనిట్‌ను పునరుద్ధరించి స్వయం ఉపాధి అవకాశాలను విస్తృతంగా వినియోగించుకోవాలని డీఆర్‌డీఓ నాగ పద్మజ సూచించారు. శుక్రవారం ఆమె వి-హబ్, ఇక్రిసాట్ ప్రతినిధులతో కలిసి యూనిట్‌ను పరిశీలించారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం కల్పిస్తున్న స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తూ, యూనిట్ పునరుద్ధరణకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం మండల సమైక్య కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.

## ఆరోగ్యశ్రీ వెనుక ఎంఆర్పీఎస్ ఉద్యమం: కట్ల రాజశేఖర్



**వర్ధన్నపేట/ఆగస్టు 7(జర్నలిస్ట్ వార్త);** ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవాన్ని పురస్కరించుకుని వర్ధన్నపేటలో ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ నాయకులు శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి కట్ల రాజశేఖర్ మాదిగ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం అమలుకు ఎంఆర్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ చేపట్టిన ఉద్యమాలే కారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాసాని గోపాల్ మాదిగ, జిల్లా ధర్మన్న మాదిగ, ఐత రాజు మాదిగ, ముత్యాల మల్లేష్ మాదిగ, వషపాక కుమార్ మాదిగ, చాడ కరుణాకర్ మాదిగ, జంగిలి భాస్కర్, ముత్యాల లులేందర్ మాదిగ, ముత్యాల సంజీవ్ మాదిగ, మారేపాక బాబు మాదిగ, గోకాల సలీం మాదిగ, మునిగాల వెంకటేష్, చింటూ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణను వినియోగించుకోవాలి: అయూబ్




**వరంగల్/ఆగస్టు 7 (జర్నలిస్ట్ వార్త):** జమాత్-ఎ-ఇస్లామీ హింద్ వరంగల్ సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 14న నిర్వహించనున్న నాగరిక వికాస్ కేంద్ర (ఎన్‌వీకే) కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సత్య శారదను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, జమాత్ ప్రతినిధులతో కలిసి శుక్రవారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా అయూబ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణతో పాటు ఉచిత ఈ-సేవలు అందించనున్నందున విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జమాత్-ఎ-ఇస్లామీ హింద్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పిట్టల రాణి కుటుంబాన్ని పరామర్శించిన చైర్మన్ పాలకుర్తి సారంగపాణి



**వర్ధన్నపేట/ఆగస్టు 7(జర్నలిస్ట్ వార్త);** పట్టణంలోని రెండో వార్డుకు చెందిన బాల వికాస్ ఆర్గనైజింగ్ పిట్టల రాణి తల్లి తిరుపతమ్మ(80) గుండెపోటుతో మృతిచెందిన విషయం తెలుసుకున్న వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. తిరుపతమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ధైర్యం కలగాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నేతావత్ శిబారాణి, బెజ్జం పాపారావు, తిరుపతి స్వామి, మాలోతు దేవేందర్, మల్లెపాక సమ్మయ్య, అనిమిరెడ్డి రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్‌కు రుణపడి ఉంటాం

**ఇంద్రానగర్‌గోపాలపూర్ మధ్య హైలెవల్ బ్రిడ్జికి రూ.1.50 కోట్లు :మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్**

**ఎల్కతుర్తి/ ఆగస్టు 7 (జర్నలిస్ట్ వార్త):**
హుస్నాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేయడం పట్ల ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని ఇంద్రానగర్ నుంచి గోపాలపూర్ వరకు హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.50 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు.బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే వర్షాకాలంలో ఇంద్రానగర్, గోపాలపూర్ పరిసర ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న రాకపోకల ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు



చేయడం అభినందనీయమన్నారు.మండల ప్రజల అవసరాలను గుర్తించి వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించడంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ చూపారని ముప్పు శ్రీనివాస్ అన్నారు.ఎల్కతుర్తి మండల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మండల ప్రజలు రుణపడి ఉంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మండల ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో మండలంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాలని ముప్పు శ్రీనివాస్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు.

# మైసీలియం, వ్యవసాయ వ్యర్థాలతో 'ఫంగీ లెదర్'

**యువ పారిశ్రామికవేత్తల వినూత్న ఆవిష్కరణ**
**పర్యావరణహిత ప్రత్యామ్నాయ తోలు తయారీ**
**రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు.. ప్రత్యేక ప్రదర్శన**

**న్యూఢిల్లీ,ఆగస్టు 7(జర్నలిస్ట్ వార్త);**
బూట్లు, బ్యాగులు, బెల్టులు, జాకెట్లు, వాహనాల సీట్లు ఇలా మనం రోజూ ఉపయోగించే ఎన్నో వస్తువుల తయారీలో జంతువుల తోలును విస్తృతంగా వినియోగిస్తుంటారు. అయితే దీనికోసం లక్షలాది జంతువులు బలవుతుండగా, పర్యావరణ కాలుష్యం కూడా పెరుగుతోంది. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే ప్రయత్నంలో ఒడిశాకు చెందిన ఓ స్టార్టప్ వినూత్న ఆవిష్కరణ చేసింది. శిలీంధ్రాల (ఫంగస్)లోని భాగమైన మైసీలియం, వ్యవసాయ వ్యర్థాలను ఉపయోగించి జంతు తోలుకు ప్రత్యామ్నాయంగా 'ఫంగీ లెదర్'ను అభివృద్ధి చేసింది. ఈ పర్యావరణహిత ఉత్పత్తి ఇప్పుడు రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనలో ప్రశంసలు అందుకుంది. ఒడిశాకు చెందిన అర్బన్-హైఫ్ బయోసైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే స్టార్టప్‌ను యువ పారిశ్రామికవేత్తలు నిషరాజ్ మహాపాత్ర, వివేక్ సింగ్ అనే ఇద్దరు స్నేహితులు స్థాపించారు. పర్యావరణాన్ని కాపాడుతూ ఫ్యాషన్ రంగంలో మార్పు తీసుకురావాలన్న లక్ష్యంతో వీరు ఈ సాంకేతికతను అభివృద్ధి చేశారు. శిలీంధ్రాల్లోని ప్రధాన భాగమైన మైసీలియంను ప్రత్యేక పద్ధతిలో పెంచి, దానిని సాగే గుణం కలిగిన తోలుగా మార్చే ప్రక్రియను రూపొందించారు. దీనివల్ల జంతు తోలు, సింథటిక్ లెదర్‌కు ప్రత్యామ్నాయంగా ఉపయోగించగల నాణ్యమైన బయో మెటీరియల్‌ను తయారు చేస్తున్నారు. ఈ వినూత్న ఉత్పత్తికి ఇప్పటికే విశేష గుర్తింపు లభించింది. రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన



ప్రత్యేక ప్రదర్శనలో ఈ స్టార్టప్ తమ ఉత్పత్తులను ప్రదర్శించగా ప్రశంసలు అందుకుంది. పర్యావరణ పరిరక్షణ, ఆధునిక బయోటెక్నాలజీ కలయికతో రూపొందిన ఈ ఫంగీ లెదర్ భవిష్యత్తులో ఫ్యాషన్ పరిశ్రమకు కొత్త దిశ చూపుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఈ స్టార్టప్ తయారు చేస్తున్న ఫంగీ లెదర్‌తో బ్యాగులు, బూట్లు, పర్సులు, బెల్టులు, వాచ్ పట్టీలు, దుస్తులు వంటి ఉత్పత్తులను రూపొందిస్తున్నారు. భవిష్యత్తులో ఫర్నిచర్, ఇంటీరియర్ డిజైన్, ఆటోమొబైల్ పరిశ్రమ, లైఫ్‌స్టైల్ ఉత్పత్తుల తయారీలో కూడా దీనిని వినియోగించే అవకాశాలు ఉన్నాయని సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. అంతేకాదు, ఈ బయో మెటీరియల్‌ను ప్యాకేజింగ్, నిర్మాణ రంగం, ఇన్సులేషన్ మెటీరియల్స్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లకు ప్రత్యామ్నాయంగా కూడా ఉపయోగించవచ్చని వారు పేర్కొంటున్నారు. ఫంగీ లెదర్ తయారీ తర్వాత మిగిలిపోయే సేంద్రియ పదార్థాలను కూడా పూర్తిగా రీసైకిల్ చేయడం వల్ల వ్యర్థాలు దాదాపు ఉండవు. ఈ వినూత్న ఉత్పత్తి తయారీకి వరి పొట్టు, చెక్క ముక్కలు వంటి వ్యవసాయ వ్యర్థాలను వినియోగిస్తారు. ముందుగా వాటిని క్రిమిరహితం చేసి, ప్రయోగశాలలో తయారుచేసిన ప్రత్యేక పోషక మాధ్యమంతో కలుపుతారు. అనంతరం నియంత్రిత ఉష్ణోగ్రత, తేమ ఉన్న గదిలో పెద్ద ట్రేలలో ఉంచుతారు. కొన్ని రోజుల తర్వాత మైసీలియం క్రమంగా పెరిగి మొత్తం ఉపరితలాన్ని ఆక్రమిస్తుంది. సుమారు 20 రోజుల తర్వాత ఇది దట్టమైన పీచు నిర్మాణంగా మారుతుంది. దాదాపు 30 రోజుల తర్వాత ఆ పొరను సేకరించి, ప్రత్యేక ప్రక్రియల ద్వారా శుద్ధి చేసి, సాగే గుణం కలిగిన తోలుగా మారుస్తారు. చివరగా దీనిని అవసరానికి అనుగుణంగా రంగులు, ఫినిషింగ్ ఇచ్చి మార్కెట్‌కు సిద్ధం చేస్తారు.

# జీఐ ట్యాగ్‌తో కుప్పడం పట్టుకు మరింత విశిష్టత

**ఉచిత విద్యుత్తు, రూ.25 వేల ఆర్థిక సాయంతో ఊరట -సీఎం చంద్రబాబుతో ముఖాముఖిలో చేనేత కుటుంబాలు**

**చీరాల,ఆగస్టు 7(జర్నలిస్ట్ వార్త);**
వన్ డిస్ట్రిక్ట్‌వన్ ప్రొడక్ట్ ద్వారా కుప్పడం పట్టు చీరలకు మరింత విశిష్టమైన గుర్తింపు లభించిందని, జీఐ ట్యాగ్‌తో అమ్మకాలు 30 శాతం మేర పెరిగాయని చేనేత కుటుంబాలు సీఎం చంద్రబాబుతో అన్నారు. గత ఏడాది చీరాలలో తయారైన కుప్పడం పట్టు తోపాటు అత్యుత్తమ వృత్తి నైపుణ్యానికి కేంద్ర ప్రభుత్వ అవార్డు దక్కడం గర్వకారణమన్నారు. 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నేతన్న సేవలో పథకాన్ని చీరాల నియోజకవర్గం కొత్తపేటలో ప్రారంభించారు. కొత్తపేట గ్రామంలోని ఓ చేనేత మగ్గం యూనిట్ ను ముఖ్యమంత్రి సందర్శించారు. చేనేత మగ్గం వద్దకు వచ్చిన ముఖ్యమంత్రికి చేనేత యూనిట్ యజమాని బండారు బాలసుబ్రహ్మణ్యం స్వాగతం పలికారు. అనంతరం చేనేత కార్మికులతో సీఎం మాట్లాడారు. కుప్పడం పట్టు చీరల ప్రత్యేకత, సంప్రదాయ నేత వృత్తి నైపుణ్యం, మార్కెట్ పరిస్థితులపై వారితో చర్చించారు. ప్రభుత్వ సాయం మాకు కొండంత అండ : చేనేత కార్మికులుచేనేతల జీవనోపాధి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై చేనేత వర్క్‌షాప్‌లోని కార్మికులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. వర్క్‌షాప్ ఏర్పాటుకు దారితీసిన ఆలోచన, యూనిట్ స్థాపన, ఎదురైన సవాళ్లు, వాటిని అధిగమించి తీర్చిదిద్దిన తీరు, యూనిట్ ను సమర్థంగా నడిపిస్తున్న అంశాన్ని వారు సీఎంకు వివరించారు. ముందుగా కంచి బోర్డర్ చీరల తయారీ దారు బత్తా ధనుంజయరావుతో ముఖ్యమంత్రి మాట్లాడారు. కుటుంబ పరిస్థితులు, చేనేత వృత్తి, ఉత్పత్తి వ్యయం, ఆదాయం, మార్కెటింగ్, విక్రయాల గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఎంతో



ఉపయోగపడుతోందని, రూ.25 వేల ఆర్థిక సాయం తమకు ప్రోత్సాహంగా ఉంటుందని వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి బండారు బాలసుబ్రహ్మణ్యంతో కలిసి వర్క్‌షాప్ లోని తొలి అంతస్తును పరిశీలించారు. భవనాన్ని విస్తరించి మరిన్ని మగ్గాలు ఏర్పాటు చేసి మరింత మంది చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలన్న ప్రణాళికలను ఆయన సీఎంకు వివరించారు. కోవిడ్ కారణంగా నిలిచిపోయిన విస్తరణ పనులను తిరిగి ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం వర్క్‌షాప్‌లో పనిచేస్తున్న ఇతర చేనేత కార్మికులతో ముఖ్యమంత్రి ముచ్చటించారు. బొడ్డు అరుణ అనే మహిళ మగ్గం పై చీర నేస్తున్న తీరును సీఎం ఆసక్తిగా పరిశీలించారు. ప్రభుత్వం అందించిన రూ.25 వేల ఆర్థిక సాయం తమ బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లు మొబైల్




ఫోన్లలో వచ్చిన సంక్షిప్త సందేశాన్ని కార్మికులు ముఖ్యమంత్రికి చూపించారు. ప్రభుత్వ సహకారంతో తమ జీవనోపాధికి భరోసా లభించిందని చేనేతలు సంతోషం వ్యక్తం చేశారు.